## చిన్నకథ

# చేయిదాటిన చెలిమి

ఈ రోజు తాననుకున్న రెండు పనులను ఎలాగైనా పూర్తి చేయాలనుకున్నాడు చక్రధర్. ఒకటి బ్యాంకులో ఆన్‌లైన్ అకౌంట్ ఓపెన్ చేయడం, మరొకటి అక్కడే పని చేస్తున్న తన ఫ్రెండ్ లక్ష్మిని కలిసి మాట్లాడటం. ఎప్పటినుంచో ఆన్‌లైన్ అకౌంట్ ఓపెన్ చేయాలని అనుకుంటున్నా పనుల ఒత్తిడి వలన చక్రధర్‌కు సాధ్యం కాలేదు. ఇటీవల తన ఫ్రెండ్ లక్ష్మి తమవూరి బ్యాంకుకు బదిలీపై వచ్చింది. ఎప్పటికప్పుడు ఆమెను కలుద్దామన్నా సమయం కుదరలేదు. అకౌంట్ ఓపెన్ చేయడం, ఆమెను కలిసి మాట్లాడటం ఒకేసారి జరుగుతాయని భావించి బ్యాంకుకు బయల్దేరాడు చక్రధర్.

దారిలో వెళుతుంటే తన కళాశాల చదువు, స్వప్నతో ప్రేమ వ్యవహారం, లక్ష్మితో స్నేహం ఒక్కొటే గుర్తుకు రాసాగాయి చక్రధర్‌కు.

***



చక్రధర్ ప్రేమించిన అమ్మాయికి లక్ష్మి ఫ్రెండ్. ఆ రకంగా ఇద్దరి మధ్యా స్నేహం కుదిరింది.

చక్రధర్, స్వప్న కాలేజీలో చదువుతున్న రోజుల్లో ప్రేమించుకున్నారు. తమ ప్రేమ వ్యవహారం స్వప్న తరచూ లక్ష్మికి చెప్పేది. వీరి ప్రేమ వివాహం దాకా రావాలని లక్ష్మి కోరుకునేది. కానీ అలా జరగలేదు. కాలేజీ జీవితం ముగిసింది. చక్రధర్, స్వప్నల ప్రేమకూడా ఫలించలేదు. దాంతో చక్రధర్ మానసికంగా కృంగిపోయాడు. స్వప్నకు, లక్ష్మికి పెళ్లిల్లయిపోయాయి.

చక్రధర్‌కి మాత్రం పెళ్లి కాలేదు. ప్రేమ ఫెయిల్ కావడంతో పాటు ఉద్యోగం రాకపోవడం కూడా బాగా ఇబ్బంది పెట్టింది.

లక్ష్మి ఒరోజు చక్రధర్‌కు తారసపడి''బాగున్నారా'' అంటూ పలకరించింది.

ఆ గొంతు ఎక్కడో విన్నట్టుందే అంటూ తనను పలకరించిన ఆమెను కాసేపు తేరిపారా చూశాక గుర్తుపట్టాడు చక్రధర్. ఒకప్పటికీ ఫ్రెండ్‌ను చూడగానే అతడిలో లిప్తపాటు ఆనందం. ''బాగున్నాను. మీరు బాగున్నారా'' అంటూ పలకరించాడు.

''నేను బాగానే ఉన్నాను. ఏమిటి అలాఅయిపోయావ్. పెళ్లి చేసుకున్నావా?'' ఆర్తిగా అడిగింది లక్ష్మి.

లేదన్నట్టు తల ఊపి మౌనంగా ఉండిపోయాడు చక్రధర్.

ఇద్దరి మధ్య చాలాసేపు మాటలు దొర్లాయి. లక్ష్మికి బ్యాంకులో ఉద్యోగం వచ్చింది. పెళ్లయ్యాక కాస్త ఒళ్లుచేసింది. ఆమెలో భౌతికంగా మార్పులున్నాయి తప్ప మానసికంగా లేవని చక్రధర్ అనుకున్నాడు.

మాటల మధ్యలో స్వప్న విషయాన్ని లక్ష్మి ప్రస్తావించింది.

''స్వప్న అదొక రకం మనిషి. మిమ్మల్ని ప్రేమించటానికి నా సపోర్ట్ కోరింది. తీరా మీరు ప్రేమించాక మీకు దూరమవడం ప్రారంభించింది. మీ ఇద్దర్నీ కలపాలని నేను ఎంతగానో ప్రయత్నించాను. సాధ్యం కాలేదు. దాని ప్రేమలో పడి మీరెంతగా కుమిలిపోయారో ఏమి పోగొట్టుకున్నారో నాకు తెలుసు. మీ ప్రేమ జంటను ఏకం చేద్దామని ఓడిపోవడంతో నేను కూడా చాలా నరకయాతన అనుభవించాను. స్వప్నని ఇకనయినా మరచిపోండి. మీరు కూడా పెళ్లి చేసుకుని హాయిగా ఉండండి. మీకు మంచి భార్య దొరుకుతుంది'' అంది లక్ష్మి.

లక్ష్మి అన్నట్టుగానే అనంతరం చక్రధర్‌కు పెళ్లయింది. అనుకూలవతి అయిన భార్య లభించింది.

కాల చక్రం గిర్రున తిరిగింది. మళ్లీ అనుకోకుండా ఒకరోజు లక్ష్మి చక్రధర్‌కు కనిపించింది.

''మీకు పెళ్లయిందటగా. పెళ్లికి పిల్చి భోజనం పెట్టలేదు. కనీసం మీ ఆవిడని మా ఇంటికి తీసుకురా. మీఇద్దరికీ భోజనం పెడతాను'' నవ్వుతూ పిల్చింది లక్ష్మి.

చక్రధర్ కాస్త సిగ్గుపడ్డాడు. ''లేదులక్ష్మి, మాపెళ్లి చాలా సింపుల్‌గా జరిగింది. అందుకే మిమ్మల్ని పిలవలేక పోయాను'' అన్నాడు.

''ఊరికే అన్నాను. మీకు పెళ్లయింది. అంతే చాలు. మీ దాంపత్య జీవితం చిరకాలం కళకళలాడాలి'' అంది లక్ష్మి.

కొంతకాలమయింది. ఏదో వూరుపోవడానికి బస్టాండులో ఉండగా లక్ష్మి చక్రధర్‌కి మళ్లీ కనిపించింది. ''పిల్లలెంతమంది? మీలాగా ఉన్నారా, మీ ఆవిడలాగా ఉన్నారా'' అని అడిగింది.

''అబ్బాయి నాలాగా, అమ్మాయి మా ఆవిడలాగా ఉంటారు'' అన్నాడు.

మెచ్చుకోలుగా తల ఊపింది లక్ష్మి. ''నాకు మీ వూరికే బదిలీ అయింది. ఇక మనం తరచూ కలుసుకోవచ్చు'' అంది.

ఆమె ఇక్కడకు వచ్చాక తమ ఇంటికి తీసుకొచ్చి తన కుటుంబ సభ్యులందరికీ పరిచయం చేయాలని మంచి భోజనం పెట్టాలని అనుకున్నాడు చక్రధర్. అయితే ఇంత వరకూ కలవలేకపోయాడు. ఇన్నాళ్లకి ఆమెను కలవడానికి, బ్యాంకులో అకౌంటు ఓపెన్ చేయడానికి బయల్దేరాడు.

***

బ్యాంకు లోపలకి వెళ్లాడు చక్రధర్. అతని కళ్లు లక్ష్మికోసం వెతికాయి. ఆమె కనిపించలేదు. కౌంటర్ దగ్గరకు వెళ్లి లక్ష్మి కోసం విచారించాడు. ఆమె మీకెలా తెలుసని కౌంటర్‌లో ఉన్నతను అడిగాడు. చక్రధర్ తమ పరిచయం గురించి చెప్పాడు. తనీమధ్య ఇక్కడకు బదిలీపై వచ్చానని చెప్పిందని తనను కలవడానికి వచ్చానన్నాడు.

చక్రధర్ వైపు జాలిగా చూశాడతను.

''అవును. మీరన్నది నిజమే. ఆమె నాలుగు నెలల క్రితమే ఇక్కడకు వచ్చారు. ఈ మధ్య ఒంట్లో బాగోలేదని సెలవుపెట్టింది. ఆమెకు రెండు కిడ్నీలు పాడయ్యాయి. శాశ్వతంగా ఆమె మనకు దూరమయింది'' అన్నాడు కౌంటర్‌లో ఉన్నతను బాధగా.

ఆ మాటలకు చక్రధర్ కాళ్లకింది నేల కంపించినట్టు వణికిపోయాడు. అతని కళ్లవెంట అప్రయత్నంగా కన్నీళ్లు రాసాగాయి.

-జి.సూర్యనారాయణ